బ్రాహ్మణుల అభివృద్ధికి నిధులు కేటాయింపుపై హర్షం


సూరజ్ తివారి

బాలానగర్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బ్రాహ్మణుల అభివృద్ధికి 100 కోట్లు కేటాయించడం సంతోషకరమైన విషయమని అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సూరజ్ తివారి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు బ్రాహ్మణ సమాజం నుంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

సున్నం చెరువు పనులు పూర్తి చేయాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్


వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మోతీనగర్: వచ్చే వర్షాకాలం నాటికి సున్నం చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లో జరుగుతున్న సున్నం చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. పునరుద్ధరణ పనులకు కలుగుతున్న ఆటంకాలపై సమీక్షించారు.

రేపు మానసిక సమస్యలపై సెమినార్

ఆల్విన్‌కాలనీ: యోగి వేమన ఫౌండేషన్, హెల్పేర్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌లో వచ్చే మతిమరుపు, వివిధ రకాల మానసిక సమస్యలపై శనివారం సెమినార్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్స్ భవనంలో సెమినార్ ఉంటుందన్నారు. వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

హెల్మెట్ లేకపోవడంతో బలమైన గాయాలు

మూసాపేట: హెల్మెట్ లేకుండా అతి వేగంతో డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సయ్యద్ జాఫర్ (31) ఖానామెట్‌లో నివాసముంటూ కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల వీధిలో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్యా, పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం ఇంటి నుంచి షాపునకు వెళ్తుండగా కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా మెట్రో పిల్లర్ నంబర్ 827 వద్ద డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో అక్కడి నుంచి 10 మీటర్ల దూరం వరకు వెళ్లి మృతి చెందాడు. తలకు హెల్మెట్ లేకపోవటంతో మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాయదుర్గం: అనుమానాస్పద పరిస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మసీదు బండ కొండాపూర్ అంబేద్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన పెండ్యాల రాజు(35) కూలిపని చేసుకొని జీవిస్తున్నాడు. భార్య లవని, ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటున్నారు. కొంత కాలంగా రాజు మద్యానికి బానిస అయి కూలి పనులకు సైతం వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం భార్య లవని ఇద్దరు కుమారులను తీసుకొని పటాన్‌చెరు చిట్కూల్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంటి వద్దే ఉంటున్న రాజును గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై తీసుకొచ్చి బుధవారం రాత్రి ఇంటి దగ్గర అరుగుపై కూర్చోబెట్టి వెళ్లాడు.

తెల్లవారుజామున రాజు విగతజీవిగా పడి ఉన్నట్లుగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు రాజు మేనల్లుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాజు సహజంగా చనిపోయాడా.? లేక ఎవరైనా గాయపరిచారా.? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నేటి నుంచి పది పరీక్షలు

- కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల్లో 49 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 10, 505 మంది విద్యార్థులు



మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి మండల పరిధిలో 38 సెంటర్లు ఉన్నాయి. ఇందులో 6 ప్రభుత్వ పాఠశాలలు, 32 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. 8,165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కూకట్‌పల్లి ఎంఈఓ కిషన్ తెలిపారు. అదే విధంగా బాలానగర్ మండల పరిధిలో 11 సెంటర్లు. ఇందులో 3 ప్రభుత్వ పాఠశాలలు, 8 ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. సుమారు 2,340 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని బాలానగర్ మండల ఎంఈఓ హరిచంద్ తెలిపారు. బాలానగర్ మండల పరిధిలో 130 మంది ఇన్విజిలేటర్లు, 22 మంది సీఎస్‌డీ అధికారులు పర్యవేక్షించనున్నారు. శుక్రవారం నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

ప్రత్యేక బస్సులు : డీఎం

10వ తరగతి పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ డిపో మేనేజర్ హరి తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రం వేరే ప్రాంతంలో ఉన్నా విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా పాస్‌ను చూపిస్తే ఉచితంగా పరీక్ష కేంద్రం వరకు ప్రయాణించవచ్చని సూచించారు.

రంజాన్ మాసం పవిత్రమైంది


ఇఫ్తార్ విందులో పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: మూసాపేటలో మొయిజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దవాత్-ఏ-ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని అన్నారు. సోదరభావానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సతీష్ రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ ఈటల జన్మదిన వేడుకలు


ఎంపీ ఈటల రాజేందర్‌తో కేక్ కట్ చేయిస్తున్న వద్దేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం ఈటల నివాసానికి వెళ్లి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్శనపల్లి సూర్యారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, నాయకులు పవన్ వర్మ, రాజిరెడ్డి, హుస్సేన్, ప్రశాంత్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రివ్యూ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కుమారి తదితరులు

బాలానగర్: బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ రివ్యూ సమావేశం జరిగింది. మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి అనంత లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఏ, బీ బ్లాక్ అధ్యక్షురాళ్లు, మున్సిపల్ అధ్యక్షురాళ్లు, డివిజన్ అధ్యక్షురాళ్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోతీనగర్: బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రభుత్వం ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మోతీనగర్ ప్రధాన రోడ్డులో గురువారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ రమేష్ నాయక్ హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం సునాయసమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దూడల మధుగౌడ్, శశి, గంట మల్లేష్, నర్సింగ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట పార్కు విల్లాలో గురువారం పర్యటించారు. వివిధ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను పిలిపించి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా డ్రైనేజీల లీకేజీలకు మరమ్మతులు చేయాలన్నారు. పగిలిన మ్యాన్‌హోల్ మూతలను తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని వాటర్ వర్క్స్ మేనేజర్ తేజకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఎలక్ట్రికల్ సాంబశివరావు, కృష్ణ, సిబ్బంది ఓంప్రకాశ్, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

మూసాపేట: మూసాపేటలోని మహంకాళి సరస్వతి దేవాలయం 10వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తూము వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, తీర్థప్రసాద వితరణ, అర్చనలు, కుంకుమార్చనలు, హోమం తదితర పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి మల్లికార్జున స్వామి ఉత్సవాలు

మూసాపేట : మూసాపేటలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుమార్‌యాదవ్, వైస్ చైర్మన్ ఎల్లేష్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి మంగళవారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు రుద్రాభిషేకం, బిల్వార్చన, 11 గంటలకు పెద్ద పట్నం, 11.30కు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు అగ్ని గుండాలు, గొలుసు తెంపుట, మల్లన్న బోనాలు నిర్వహించనున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


కేక్ కట్ చేస్తున్న మహిళలు, బస్తీ వాసులు

ఆల్విన్‌కాలనీ: మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతూ ఆర్థికంగా స్థిరపడాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం వీరాంజనేయ శివాలయం ఆవరణలోని కమిటీ హాల్‌లో మహిళలను సన్మానించారు. కేకు కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎల్. ఇంద్రసేనా, సీఓ సుజాత, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు మంజుల, పద్మావతి, పాపిరెడ్డినగర్ ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు వి. శోభ రాణి, కార్యదర్శి వెంకటలక్ష్మి, కోశాధికారి సౌజన్య, పాపిరెడ్డినగర్ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న తైబజార్ వేలం పాట

నిజాంపేట్: నిజాంపేట్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి రోజువారి, వారాంతపు మార్కెట్లు తైబజారు కమిషనర్ ఆధ్వర్యంలో సర్కారీ వారి పాట రూ.19,50,000లు నిర్ణయిస్తూ ఈ నెల 27న ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. వేలంలో తైబజార్ హక్కులు పొందిన వారు 50 శాతం నగదు, 6 చెల్లుబాటు అయ్యే చెక్కులు 7 రోజులలో నగర పాలక సంస్థకు జమ చేసి అగ్రిమెంట్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి నెల 5వ తేదీలోగా సూచించిన నెలవారి వాయిదా చెల్లించాలన్నారు. ఆసక్తి గలవారు మున్సిపల్ కార్యాలయం నందు రూ.3000 నగదు చెల్లించి, లేదా కమిషనర్ నిజాంపేట్ నగర పాలక సంస్థ హైదరాబాద్ నందు చెలుబాటు అయ్యే డిమాండ్ డ్రాఫ్ట్‌ను సమర్పించాలన్నారు. నియమ నిబంధనలతో కూడిన దరఖాస్తును గురువారం ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తును రూ.3 లక్షల డీడీతో పాటు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఏదైనా సమాచారం కావాలంటే కార్యాలయ సమయంలో పన్నుల విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఇస్తానన్న లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎక్కడ?

- కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు యుగంధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు యుగంధర్‌రెడ్డి

బాలానగర్: పేద ప్రజలకు లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తానని ఎమ్మెల్యే ఇవ్వలేదని, కనీసం 100 పడకల హాస్పిటల్‌ను కూడా సాధించలేదని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు యుగంధర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కృష్ణారావు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండానే అభివృద్ధి చేసినట్లు మోసపూరిత మాటలు చెప్పి ఎన్నికల్లో గెలిచారన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాలో 47 ఎకరాల గురించి పట్టించుకోలేదని, దాంట్లో సుమారు 8 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ మధుమోహన్, గజానంద్, శివ, లక్ష్మయ్య, కృష్ణ, రాము, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ అమలయ్యేలా కేటాయింపులు జరగలేదు

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు

నిజాంపేట్ : చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దళితుల విద్యా, వైద్యం రహదారులు, తాగునీరు వంటి మౌలిక ప్రయోజనాలపై దృష్టి సారించలేదన్నారు. రాష్ట్రంలో 64 లక్షల జనాభా కలిగిన దళితులకు కనీస ప్రాథమిక అవసరాలు తీర్చే విధంగా బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయహస్తానికి ఏటా రూ.750 కోట్లు కేటాయిస్తామన్న మాట నిలబెట్టుకోవాలని కోరారు.

వీఎన్‌ఆర్ వీజేఐఈటీలో ముగిసిన సాంస్కృతికోత్సవం


పాట పాడుతున్న గాయకుడు కార్తీక్

నిజాంపేట్ : ప్రగతినగర్‌లోని వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో సిన్టిలేషన్ 25 వేడుకలు విజయవంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు ఆటపాటలతో, సంప్రదాయ వస్త్రధారణతో సందడిగా సాగింది. కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర గాయకుడు కార్తీక్ అలరించారు. అనంతరం మ్యాడ్ స్క్వేర్ చిత్ర బృందం విద్యార్థుల సందడి నడుమ తమ చిత్రానికి ప్రచారం కల్పించారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్

కుత్బుల్లాపూర్: బెల్ట్ షాపు నిర్వాహకునిపై కేసు నమోదైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం. గుండ్లపోచంపల్లికి చెందిన నవీన్‌గౌడ్ దుకాణంపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అక్రమ మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి


గచ్చిబౌలి స్టేడియంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం కోచ్‌లు, క్రీడాకారులతో పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.465కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడారంగాన్ని బలోపేతం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతన స్టేడియాల నిర్మాణం, స్టేడియాల ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. గతేడాది బడ్జెట్‌లో క్రీడలకు రూ.364 కోట్లు పెట్టగా ఈ ఏడాది రూ.465కోట్లు కేటాయించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె మధు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్

జగద్గిరిగుట్ట: సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం డాక్టర్ జాంగిర్ హుస్సేన్ అధ్యక్షతన జగద్గిరిగుట్టలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు అండగా ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం, ఎస్సీ వర్గీకరణ శాసనసభలో ఆమోదించిన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. రాష్ట్రీయ దళిత సేన జాతీయ చైర్మన్ జేబీ రాజు ఆధ్వర్యంలో సీఎంను కలిసి హైదరాబాద్‌లో లక్ష మందితో అభినందన సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో రాష్ట్రీయ దళిత సేన మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ జాంగిర్ హుస్సేన్, దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఖాదల అమర్ బాబు, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు జేమ్స్, ప్రధాన కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు.

ఐటీఎఫ్ఎల్, మిసెస్‌ఇండియా ఫ్యాషన్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

రాయదుర్గం: భారతదేశంలో మొట్టమొదటిసారిగా మాతృమూర్తులు, పిల్లలకు కలిపి ఫ్యాషన్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సమాన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్(ఎస్‌సీడీఎస్), విబ్బార్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ భారీ ఫ్యాషన్ ఈవెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఇండియా టీన్స్ ఫ్యాషన్ లీగ్(ఐటీఎఫ్ఎల్), మిసెస్ ఇండియా ఫ్యాషన్ పోటీని దేశవ్యాప్తంగా ఉన్న ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యా కేంద్రాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. అంతేకాకుండా ఫినాలే పోటీలను మే నెలలో హైదరాబాద్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్స్ సంస్థల ప్రతినిధులు సుచరిత, మనోపట్వర్ధన్, అభిషేక్ అగర్వాల్, ప్రీతి అగర్వాల్, ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ తప్పిపోయిన పిల్లలు

- పిల్లలకు చాక్లెట్ కొనిచ్చి వివరాలు తెలుసుకున్న స్థానిక మహిళ
- పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత


పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు ఒక్కసారిగా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోయారు. పిల్లల కోసం వెతికినా కనిపించకపోవంతో 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పిల్లల కోసం గాలింపు చేపట్టారు. అప్పుడే ఓ మహిళ ఫోన్ చేసి మీ పిల్లలు మా వద్ద ఉన్నారు అని చెప్పడంతో అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సర్దార్ పటేల్ నగర్‌లో నివాసం ఉండే హరీన్ కూతురు ఇదిక (5), అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న రత్న కుమార్ కుమారుడు అద్వైత్ (5) ఫస్ట్ క్రై పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాలకు సెలవులు కావడంతో ఇద్దరు పిల్లలు ఇంటి ముందు ఆడుకుంటూ సాయంత్రం నాలుగున్నర సమయంలో కనిపించకుండా పోయారు. పిల్లలు కనిపించకపోవడంతో ఇదిక తండ్రి హరీన్ 100కు డయల్ చేసి చెప్పాడు. వెంటనే కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చేపట్టారు. అయితే ఇద్దరు చిన్నారులు ఇంటికి సుమారు కిలో మీటరున్నర దూరంలోని ఫోరం మాల్ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా గమనించిన స్థానిక మహిళ వారిని చేరదీసి చాక్లెట్ కొనిచ్చి వివరాలు అడిగింది. ఇదిక తన తల్లి ఫోన్ నెంబర్ చెప్పడంతో ఫోన్ చేసి పిల్లలు తన వద్ద ఉన్నారని తీసుకు వెళ్లాలని చెప్పింది. దీంతో పిల్లల తల్లిదండ్రులు, పోలీసులు అక్కడికి చేరుకుని పిల్లలను తీసుకున్నారు.

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ మహిళ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రావులపల్లికి చెందిన శ్రీనివాస్, శాంతకుమారి(40) లు భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని అరిమ్స్‌బర్గ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇళ్లల్లో పనిచేసే శాంతకుమారి (40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ పై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.